సాక్షి
కామారెడ్డి
గురువారం । 15 । మే । 2025



అభివృద్ధే ధ్యేయం

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు.

- 9లో ▸



ఆర్టీసీ క్యూఆర్ కోడ్..

ఆర్టీసీ క్యూఆర్ కోడ్ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.5 /21.8

ఆకాశం మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అధికారులకు అభినందన



కామారెడ్డి క్రైం: డీఆర్‌డీవో అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం అభినందించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో 11,668 మహిళా సంఘాలకుగాను రూ.802 కోట్ల విలువైన బ్యాంక్ లింకేజీ రుణాలను అందించడం ద్వారా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో ఇందుకోసం కృషి చేసిన డీఆర్‌డీవో సిబ్బందిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం తన చాంబర్‌లో సన్మానించారు. ఈయేడాది సైతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీఎం సుధాకర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ మధురానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ, యూసుఫ్‌గూడ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో అనాథలు, పాక్షిక అనాథలు, పేద బాలికలకు ప్రవేశం కల్పించనున్నారు. ఆసక్తి గలవారు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా సంక్షేమాధికారి ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ రాయకపోయినా పదో తరగతి పాసైతే చాలని పేర్కొన్నారు. అనాథలకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని తెలిపారు. దరఖాస్తుల సమర్పణ, ఇతర వివరాలకు కామారెడ్డి ప్రియా డీలక్స్ రోడ్డులోని బాలరక్ష భవన్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు

నాగిరెడ్డిపేట: బక్రీద్‌ను పురస్కరించుకొని జిల్లా సరిహద్దులోగల పోచారం వద్ద బుధవారం పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. జిల్లాలోకి ప్రవేశించే, జిల్లాను దాటి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. వచ్చేనెల ఏడో తేదీ వరకు చెక్‌పోస్ట్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో ఉన్న పోలీస్ సిబ్బంది విడతలవారీగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తారని తెలిపారు.

ఎలక్ట్రీషియన్‌పై వేటు

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు: భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయంలో హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించిన ఎలక్ట్రీషియన్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ బుధవారం తెలిపారు. గత నెల 22న ఆలయంలో హుండీ లెక్కిస్తుండగా సదరు ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. ఈ విషయాన్ని 'సాక్షి' గతనెల 29న వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఎలక్ట్రీషియన్‌ను సస్పెండ్ చేయాలని ఈవోను ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆర్‌జేసీ ఆదేశాల మేరకు ఎలక్ట్రీషియన్‌పై చర్యలు తీసుకున్నామన్నారు.

రెండు రోజుల్లో జొన్న కొనుగోళ్ల నిలిపివేత



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని సొసైటీలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి మహేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. రెండు రోజుల్లో జొన్న కొనుగోళ్లను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. ఇంకా రైతుల వద్ద జొన్నలుంటే వెంటనే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

17 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ఉద్యోగి ప్రారంభిక్ వర్గ

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ఈనెల 17న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఉద్యోగి ప్రారంభిక్ వర్గ ప్రారంభంకానుందని ఆ సంస్థ జిల్లా కార్యవాహ సంతోష్‌రెడ్డి తెలిపారు. 17వ తేదీన సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే శిక్షావర్గ 19న ముగుస్తుందని పేర్కొన్నారు. 20 ఏళ్లపైబడి ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం, వృత్తి పనుల్లో స్థిరపడ్డవారు పాల్గొనాలని, ఇతర వివరాలకోసం 94411 54360, 94407 68774, 99489 28740 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దొంగకు కీ ఇవ్వొద్దు!



ఈనెల 11న రాత్రి సదాశివనగర్ మండలం యాచారం తండాలో దొంగలు జగదాంబ మాత అలయ ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి హుండీ చోరీ చేశారు.

ఈనెల 8 న వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. దొంగలు 8 తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

ఈనెల 7 న గాంధారి మండలం పొతంగల్ ఖుర్దు గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసి నగదు, బంగారం అపహరించారు. అదే రోజు రాత్రి ఓ ఇంట్లోకి చొరబడి కత్తితో బెదిరించి మహిళ మెడలోంచి బంగారు గొలుసు తెంపుకెళ్లారు.

15 రోజుల క్రితం తాడ్వాయికి చెందిన సాయిలు కుటుంబం తాళం వేసి ఊరెళ్లింది. దొంగలు ఆ ఇంటి తాళం పగులగొట్టి, 40 తులాల వెండి, కొంత నగదు ఎత్తుకెళ్లారు. అదే రోజున పక్క కాలనీలోని పరశురాములు ఇంట్లో కూడా చోరీ చేసి బంగారం, నగదు అపహరించారు.

20 రోజుల క్రితం బాన్సువాడకు చెందిన సాయవ్వ ఇంటికి తాళం వేసి దాబాపై పడుకుంది. దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి 12 తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

గత నెల 29న పొతంగల్ మండలం హంగర్గాలో పుట్టి రాములు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి మేడపై పడుకున్నారు. దొంగలు ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు.

గతనెల 12 న బాన్సువాడలోని సంగమేశ్వర కాలనీలో తాళం వేసిన రెండిళ్లలో చోరీలు జరిగాయి.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో చోరులు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

– కామారెడ్డి క్రైం

- ఉమ్మడి జిల్లాలో రెచ్చిపోతున్న చోరులు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పోలీసులు

సాధారణంగా వేసవిలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈసారి కూడా చేతివాటం ప్రదర్శిస్తునారు. వేసవి సెలవుల్లో పట్టణాల నుంచి చాలా మంది స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు, ఆధ్యాత్మిక పర్యటనలకు వెళ్తుంటారు. ఇలాంటి సమయాల్లోనే తాళం వేసిన ఇళ్లకు కన్నం వేయడానికి దొంగలు పథకాలు వేస్తుంటారు.

పగలు రెక్కీ.. రాత్రికి చోరీలు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులను కలిగి ఉంది. దీంతో ఇక్కడ దొంగల బెడద మొదట్నుంచీ ఎక్కువే. కర్ణాటకలోని బీదర్, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతాలకు చెందిన దొంగలు, పార్థీ గ్యాంగ్ లాంటి ముఠాలు ఎక్కువగా ఇక్కడ చోరీలకు పాల్పడుతుంటాయి. ఇటీవల ఇతర రాష్ట్రాల దొంగల ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. వీరు ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తుంటారు. అంతేకాక ఏకంగా కత్తులతో బెదిరిస్తూ చోరీలకు పాల్పడుతున్న ఘటనలు సైతం వెలుగు చూస్తున్నాయి. దొంగలు పగటిపూట కాలనీల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను ఎంచుకుంటారని, అర్ధరాత్రి దాటాక ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడుతుంటారని తెలుస్తోంది. సీసీ కెమెరాల్లో తమ ఆనవాళ్లు తెలియకుండా ముసుగులు ధరించడం, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై సంచరించడం చేస్తున్నారు. దీంతో వారిని గుర్తించడంలో పోలీసులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



తాడ్వాయిలో దొంగలు బీరువా పగులగొట్టి వస్తువులను చిందరవందర చేసిన దృశ్యం(ఫైల్)

అప్రమత్తంగా ఉంటేనే..

- బంగారం, ఆభరణాలు వంటి విలువైన వస్తువులు ఇంట్లో ఉంచడం కంటే.. బ్యాంకు లాకర్‌లో గానీ, బంధువుల వద్ద గానీ దాచుకోవడం ఉత్తమం.
- ఇంటికి వేసిన తాళం బయటికి కనిపించకుండా కర్టెన్‌తో కప్పి ఉంచాలి. సెంట్రల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుంటే మంచిది.
- ఊర్లెళ్లే వారు సమీపంలోని పోలీసులకు సమాచారం ఇస్తే ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుంది.
- బీరువా తాళాలు దొంగలకు తేలికగా దొరికే ప్రదేశాల్లో పెట్టకూడదు.
- కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

దొంగతనాల నివారణకు చర్యలు..



ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలి. విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకూడదు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో దొంగతనాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలి.

– రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి



అడ్లూర్‌లో లబ్ధిదారుకు ఇంటి మంజూరు పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు అడ్లూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన గండ్ల హేమలతకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, 575 ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. హేమలత మాట్లాడుతూ తన భర్త మరణించాడని, బీడీలు చుడుతూ ఇద్దరు కుమారులను చదివిస్తున్నానని పేర్కొంది. తనకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినందుకు సంతోషంగా ఉందని తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ జైపాల్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాపూర్‌లో..

లింగంపేట: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం ముస్తాపూర్‌లో పర్యటించారు. గ్రామానికి చెందిన జూకంటి అనితకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాన్ని అందించారు. అలాగే మార్కౌట్ చేశారు. లబ్ధిదారు అనిత మాట్లాడుతూ తన భర్త మరణించడంతో కూలి పనులు చేస్తూ ఇద్దరు ఆడ పిల్లలను పోషించుకుంటున్నానని పేర్కొంది. ఇల్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేసింది.

పలు గ్రామాల్లో పర్యటన..

కోమట్‌పల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం తూకాలు పూర్తి కావచ్చాయని, తూకం వేసిన బస్తాలను రైస్ మిల్లులకు తరలిస్తున్నామని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. అనంతరం కలెక్టర్ పోతాయిపల్లి గ్రామానికి చేరుకొని సర్వే నంబర్ 899లో గల భూమిని పరిశీలించారు. లింగంపేట, పోతాయిపల్లి గ్రామాల భూభారతి డెస్కు వర్క్‌లను పరిశీలించారు. డెస్కువర్క్ వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్, డీఆర్‌డీవో సురేందర్, తహసీల్దార్ సురేష్ తదితరులున్నారు.



ముస్తాపూర్‌లో లబ్ధిదారుకు మంజూరు పత్రం అందిస్తున్న కలెక్టర్

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో నిధులు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి కాకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. మంజూరు ఇచ్చిన వాటిలో క్షేత్ర స్థాయిలో అవసరం లేనివి ఏమైనా ఉంటే వెంటనే సరైన కారణాలు తెలుపుతూ పనుల రద్దుకు ప్రతిపాదించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో తృతీయ స్థానం

కామారెడ్డి క్రైం: జిల్లాలో 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 446 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 58,655 మంది రైతుల నుంచి రూ.735 కోట్ల విలువైన 3.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని పేర్కొన్నారు. ఇందులో 1.49 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.67 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకం ధాన్యం ఉందని తెలిపారు. ఇప్పటివరకు 44,204 మంది రైతులకు రూ. 616.10 కోట్లు చెల్లించామని, మిగతావారికి త్వరలోనే డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు సన్నరకం ధాన్యానికి సంబంధించి 16,109 మంది రైతులకు రూ.66.23 కోట్ల బోనస్ కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేశామని తెలిపారు.

డబ్బులు లాక్కొని.. అడిగితే బెదిరిస్తూ..

- మెప్మా ఆర్పీ నిర్వాకం
- ఇబ్బందిపడుతున్న మహిళా సంఘం సభ్యులు

కామారెడ్డి టౌన్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అండగా ఉండాల్సిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఉద్యోగులే సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సంఘానికి మంజూరైన రుణంలో కొంత మొత్తాన్ని సొంతానికి వాడుకుని తిరిగి ఇవ్వకుండా ఓ ఆర్పీ వేధిస్తున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. సదరు ఆర్పీకి టీఎంసీ సైతం మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొంటున్నారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కామారెడ్డి పట్టణంలోని 25 వ వార్డు గాంధీనగర్‌లోని అర్చన మహిళా సంఘంలో 10 మంది సభ్యులున్నారు. ఈ సంఘానికి మార్చి మొదటి వారంలో రూ. 15 లక్షల రుణం మంజూరయ్యింది. ఈ గ్రూప్‌నకు సంబంధించిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ) బ్యాంకు ఆవరణలోనే రూ. 3.50 లక్షలు లాక్కొని మిగతా డబ్బులను సభ్యులకు పంపిణీ చేసింది. మొత్తం డబ్బులు ఇవ్వాలని అడిగినా వినకుండా మిగతా డబ్బులు ఐదు రోజుల్లో ఇస్తానంటూ అక్కడినుంచి వెళ్లిపోయింది. సభ్యులు ఐదు రోజుల తర్వాత గాంధీనగర్‌లో ఆర్పీ నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లగా.. తన ఇంటికి వెస్తే పెంపుడు కుక్కతో కరిపిస్తానని బెదిరించింది. వారం తర్వాత మళ్లీ వెళ్లగా అదే తరహాలో వ్యవహరించింది. ఇలా రెండు నెలలు గడిచాయి. మరోవైపు బ్యాంకుకు రుణ వాయిదాలు చెల్లించకపోవడంతో వారం రోజులుగా బ్యాంక్ అధికారులు మహిళా సంఘం సభ్యులను నిలదీస్తున్నారు. ఈ విషయాన్ని మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, టీఎంసీ సునీతల దృష్టికి తీసుకువెళ్లామని సంఘం సభ్యులు తెలిపారు. ఆర్పీని అడిగితే డబ్బులు ఇవ్వనని, ఏం చేసుకుంటారో చేసుకోండని పేర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎంసీ సైతం ఆర్పీకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. సదరు ఆర్పీ బతుకమ్మకుంటలోని ఓ సంఘం నుంచి కూడా భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది.

చర్యలు తీసుకుంటాం

అర్చన మహిళా గ్రూప్ సభ్యుల నుంచి ఆర్పీ రూ. 3.50 లక్షలు తీసుకున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. డబ్బులను మూడు రోజుల్లో ఇచ్చేయాలని ఆర్పీని ఆదేశించాం. ఈ వ్యవహారంలో టీఎంసీకి నోటీసు జారీ చేస్తాం. 3 రోజుల్లో స్పందించకపోతే ఆర్పీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సంఘాల సభ్యులు ఆర్పీలకే కాదు ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదు.

– శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ, కామారెడ్డి

బిచ్కుంద పీఎస్‌లో ఏసీబీ తనిఖీలు

- అక్రమ వసూళ్ల విషయంలో ఎస్సైపై విచారణ
- ఆరు గంటలపాటు కొనసాగిన సోదాలు

బిచ్కుంద: ఏసీబీ అధికారులు బుధవారం బిచ్కుంద పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో ఎస్సై మోహన్‌రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. సుమారు ఆరు గంటలపాటు స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో పోలీసులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయన్నారు. ఈ అంశంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో తాము సోదాలు నిర్వహించామని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఎస్సై మోహన్‌రెడ్డి పట్టుకున్న పది ఇసుక ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాయని, వారిని డబ్బులు అడిగారని, అలాగే గతంలో పలు కేసులలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. దాని ఆధారంగా పూర్తి విచారణ చేసి పైఅధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. కాగా మంజీర నది పరీవాహక ప్రాంతాల నుంచి వందలాది ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఫిర్యాదు చేసినవారెవరూ సాక్ష్యం చెప్పడానికి ముందుకు రావడం లేదని ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడుతున్న ఏ శాఖ అధికారులపైనైనా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

జరిమానా కట్టినా వదలడం లేదు

జరిమానా కట్టినా పోలీసులు ట్రాక్టర్లు వదిలిపెట్టడం లేదని పలువురు ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతితో ఇసుక తరలిస్తున్నామని, పట్టుకున్న పది ట్రాక్టర్లను ఎస్సై మోహన్‌రెడ్డి మైన్స్ అధికారులకు అప్పగించారని పేర్కొన్నారు. మైన్స్ అధికారులు విధించిన జరిమానా చెల్లించి నాలుగు రోజులవుతున్నా పోలీసులు ట్రాక్టర్లు వదిలిపెట్టడం లేదన్నారు.

ఐ యామ్ ఏ ఫార్మర్

- పెళ్లిపత్రికలో సగర్వంగా ముద్రించుకున్న యువరైతు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతేరాజు అనేది అనాదిగా ఉన్న నానుడి. అయితే రానురాను వ్యవసాయం చేస్తున్న యువకులను పెళ్లిచేసుకునేందుకు మాత్రం అమ్మాయిలు ముందుకు రావడం లేదు. దీంతో వ్యవసాయం చేస్తున్నానని చెప్పుకునేందుకు సైతం యువత ముందుకు రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఓ యువకుడు తాను రైతునని గర్వంగా చాటుకుంటున్నాడు. తన వివాహ పత్రికపై 'ఐ యామ్ ఏ ఫార్మర్' అని పేరు పక్కన సగర్వంగా పెట్టుకున్నాడు. అదేవిధంగా నాగలి పట్టిన రైతు, ఎద్దుల బొమ్మను ఉండేలా పత్రికను ముద్రించుకున్నాడు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం మాతు సంగెం గ్రామానికి చెందిన యువ రైతు జ్ఞానేశ్వర్, సౌందర్య వివాహం ఈ నెల 22వ తేదీన గాంధారిలో జరగనుంది. వివాహ పత్రిక చూసినవారు దీనిపై చర్చించుకుంటున్నారు.



వివాహ పత్రిక

అకాల వర్షంతో ఇబ్బందులు



నర్వ శివారులో వడ్ల కుప్పల చుట్టూ ఉన్న నీటిని కాలువ ద్వారా తొలగిస్తున్న రైతు



తడిసిన ధాన్యం బస్తాలను తరలిస్తున్న రైతులు

నిజాంసాగర్: అకాల వర్షాలకు అన్నదాత ఆగమవుతున్నాడు. పంటలు తడిసిపోతుండడంతో ఆందోళన చెందుతున్నాడు. మంగళవారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాలలో వర్షం కురిసింది. మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి, నర్వ, మహమ్మద్‌నగర్, గున్కుల్, బూర్గుల్, తుంకిపల్లి, కోమలంచ, గాలీపూర్, ముగ్దుంపూర్, గిర్ని, కొనతండాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు తడిసిపోయాయి. కుప్పలచుట్టూ చేరిన నీటిని తొలగించేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. తడిసిన ధాన్యం బస్తాలను రోడ్డువరకు మోసుకుని వచ్చి ఆరబెట్టారు. త్వరగా తూకాలు పూర్తి చేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

తాడ్వాయిలో..



రోడ్డుపై కూలిన చెట్టు

తాడ్వాయి: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల కుప్పలు తడిసిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. తాడ్వాయి శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్తంభం విరిగిపోయింది. బుధవారం విద్యుత్ అధికారులు మరమ్మతులు చేశారు. చెట్లు విరిగి రోడ్లపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మామిడికాయలు రాలి కిందపడ్డాయి. తాడ్వాయిలో శేర్ల పోశయ్య, కీసరి గంగాధర్‌ల ఇళ్ల రేకులు కొట్టుకుపోయాయి.

క్లుప్తంగా

ఆర్టీసీ క్యూఆర్ కోడ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఆర్టీసీ క్యూఆర్ కోడ్ కీచైన్‌ను చూపుతున్న అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ నూతనంగా అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కామారెడ్డి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ ఆర్టీసీ క్యూఆర్ కోడ్ కీచైన్‌లను జిల్లా అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీకి సంబంధించి పూర్తి సమాచారం అరచేతిలో ఉంటుందన్నారు. ఆర్టీసీ యాప్‌లు, వెబ్‌సైట్ వివరాలు, టికెట్ బుకింగ్, బస్సుల టైంటేబుల్, ఇతర వివరాలు ఈ క్యూఆర్ కోడ్‌తో తెలుస్తాయన్నారు. తాజాగా క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన ఈ కీచైన్‌లను ప్రయాణికులకు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీపీఆర్‌వో భీమ్‌కుమార్, ఆర్టీవో వీణ తదితరులు పాల్గొన్నారు.

ఉసురుతీసిన ఆన్‌లైన్ గేమ్

● రాయకూర్‌లో యువకుడి ఆత్మహత్య


గంగాధర్ (ఫైల్)

రుద్రూర్: ఆన్‌లైన్ గేమ్ కు అలవాటుపడ్డ యువకుడు డబ్బులు పోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రాయకూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయకూర్ గ్రామానికి చెందిన మాగిరి గంగాధర్ (20) కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నాడు. డబ్బులు లేకపోవడంతో తండ్రి ఫోన్‌లో నుంచి రూ. 5 వేలు తన ఫోన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకొని గేమ్ ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన గంగాధర్ మంగళవారం రాత్రి పాడుబడ్డ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు వెతుకుతుండగా బుధవారం ఉదయం మృతదేహం కనిపించింది. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని..

డిచ్‌పల్లి: పని చేయాలనీ లేదా చదువుకోవాలని తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి శివారులోని ఇటుకబట్టీ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన భరత్ మాజీ, అతని భార్య మెంట్రాజ్‌పల్లిలోని ఆంజనేయులుకు చెందిన ఇటుకబట్టీలో కొంతకాలంగా కూలీలుగా పనిచేస్తున్నారు. వారి కొడుకు మున్నీ మాజీ (14)ని స్థానికంగా చదువుకోవాలని లేదా పనిచేయాలని తండ్రి మంగళవారం మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన మున్నీ మాజీ అర్ధరాత్రి తాము ఉంటున్న రేకుల షెడ్డులోని కర్రకు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే గమనించిన కుటుంబసభ్యులు బట్టీ యజమానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీ శివారులో బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన తక్కడపల్లి శ్రీకాంత్ (32) మెకానిక్‌గా పనిచేస్తూ బీడీ వర్కర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య లత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గొడవల కారణంగా భార్య పిల్లలతో కలిసి మూడు నెలలుగా తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. దీంతో శ్రీకాంత్ మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్ బుధవారం జయశంకర్ కాలనీ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కరడ్‌పల్లి గ్రామశివారులో పేకాటస్థావరంపై బుధ వారం దాడి చేసి రాజు, సంతోష్, నర్స య్యలను పట్టుకున్నట్లు ఎస్సై మురళి తెలిపా రు. వారిపై కేసు నమోదు చేసి, రూ.8,700 లు, మూడు బైక్‌లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

'వెంచర్' చేస్తే.. పక్కాగా ఉండాల్సిందే

- టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- నుడా అనుమతి తప్పనిసరి
- 10 శాతం స్థలం ఖాళీగా ఉంచాలి



నిజామాబాద్ సిటీ: నుడా పరిధిలో వెంచర్ వేయాలంటే నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాల్సిందేనంటున్నారు అధికారులు. ప్రభుత్వ అనుమతులు సరిగా లేకున్నా, వివాదాస్పద స్థలాలున్నా నిబంధనలు అతిక్రమించినా వెంచర్ల కథ కంచికేనంటున్నారు. గతంలో వెంచర్లు ఎలా చేసినా చెల్లుబాటు అయింది. కానీ, ప్రస్తుతం మాత్రం టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని, సరైన ధృవీకరణ పత్రాలుంటేను వెంచర్లకు అనుమతి మంజూరు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

విచ్చలవిడిగా వెలుస్తున్న వెంచర్లు..

నగర శివార్లతోపాటు నుడా పరిధిలో వెంచర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా రియల్టర్లు వెంచర్లు చేస్తున్నారు. అనుమతులు లేకుండానే ప్లాటింగ్ చేసి వాటిని దళారులతో అమ్మిస్తున్నారు. కొన్నిచోట్ల అక్రమ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసిన అమాయకులు లబోదిబోమంటున్నారు. అమాయకులే లక్ష్యంగా రియల్టర్లు స్థానిక నాయకులతో ములాఖత్ అవుతున్నారు. వారికి కమీషన్ ఆశ చూపి వారితో ప్లాట్లను విక్రయిస్తున్నారు. అనుకున్నదే తడవుగా, స్థలం ఉంటే చాలు వెంచర్లు వేస్తున్నారు. ముందస్తు అనుమతులు లేకున్నా పనులు మొదలుపెడుతున్నారు. రాత్రింబవళ్లు పనులు చేసి అధికారుల దృష్టికి వచ్చేలోపు ప్లాట్లన్నీ అమ్మేస్తున్నారు.

నగర శివార్లలో అధికం..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నగర శివార్లలో ఈ అక్రమ వెంచర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. నాగారం, గొల్లగుట్ట, గాంధీనగర్, సారంగపూర్, శాస్త్రీనగర్, మల్కాపూర్-ఏ, ముబారక్‌నగర్, కేశాపూర్, బర్దిపూర్, బోర్గాం (పి), న్యాల్‌కల్, మోపాల్, సిరిపూర్, రాంనగర్, బోర్గాం (కె), ఖానాపూర్, గాడ్స్ కాలనీ, తారకరామనగర్ శివార్లలో వెంచర్లు వెలుస్తున్నాయి. 2 నుంచి 5 ఎకరాలున్నా చాలు వెంటనే వాటిని వెంచర్లు చేసి హాట్‌కేకుల్లా అమ్మేస్తున్నారు.

ప్రభుత్వ, ఇరిగేషన్, వక్ఫ్ భూములు..

వెంచర్లు చేస్తున్న రియల్టర్ల కన్ను ప్రభుత్వ, అసైన్డు, ఇరిగేషన్, వక్ఫ్ భూములు, స్మశానాలపై పడింది. దాంతో తమ స్థలంతో పక్కనే ఉన్న ఈ స్థలాలను సైతం కలుపుకుంటున్నారు. ఇలా నాలాలు, కుంటలు, స్మశాన వాటికలు, పబ్లిక్ పార్కుల స్థలాలనూ వదలడం లేదు.

విస్తరించిన నుడా పరిధి..

నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ గతంలో కేవలం 72 గ్రామాలకే పరిమితమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం 380 గ్రామాలకు విస్తరించింది. ఇందులో 3 మున్సిపాలిటీలు కూడా వచ్చాయి. ఈ పరిధిలో వెంచర్లు చేయాలంటే నుడా అధికారి డీసీపీ అనుమతి తప్పనిసరి. కానీ, స్థానిక నాయకుల సహకారంతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వెంచర్లు వేయడం గమనార్హం.

నిబంధనలు ఇవే..

- వెంచర్‌చేసే స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు సరిగ్గా ఉండాలి.
- మొత్తం వెంచర్ విస్తీర్ణంలో 10 శాతం స్థలం వదిలివేయాలి. (ఈ స్థలంలో పార్కు, ఆస్పత్రి, కిరాణాషాపు, మెడికల్ షాపు వంటి వాటి కోసం).
- రోడ్లు, డ్రైనేజీలు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి.
- ఏరియా మార్కెట్ రేటు ప్రకారం ఫీజును నుడాకు లేదా మున్సిపాలిటీకి చెల్లించాలి.
- 15 శాతం సొమ్ము చెల్లించిన తర్వాత మొదటి డ్రాఫ్ట్ ఇస్తారు.
- మొదట డమ్మీ వెంచర్ ఏర్పాటు చేయాలి.
- రెండేళ్ల తర్వాత వెంచర్‌ను పక్కాగా నిబంధనల మేరకు నిర్మించాలి.
- సూచించిన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాతే ఫైనల్ లేఅవుట్‌ను అనుమతిస్తారు.

అక్రమ వెంచర్లు కూల్చివేస్తాం



వెంచర్ చేయాలనుకునేవారు టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. డాక్యుమెంట్లలో లోపాలుండొద్దు. సూచించిన స్థలంలోనే వెంచర్ చేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రజలు జాగ్రతగా ఉండాలి. నాన్ లే అవుట్ వెంచర్లలో ప్లాట్‌లు కొని మోసపోవద్దు. ఇటీవల అనుమతి లేని వెంచర్లను తొలగించాం.

– శ్రీధర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చీఫ్ ప్లానర్

నుడా అనుమతి తీసుకోవాలి



టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి పొంది, సరైన ఫీజు చెల్లించాలి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టవద్దు. సరైన పత్రాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులకు సహకరించాలి. నాన్ లేఅవుట్ వెంచర్లు చేస్తే తొలగిస్తాం. వెంచర్ పూర్తయిన తర్వాతే అమ్మకాలు చేయాలి. నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– కేశ వేణు, నుడా చైర్మన్

నీటి తొట్టె ఇలా.. పశువులు తాగేదెలా

మద్నూర్: మండలంలోని సోనాల గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన పశువుల నీటి తొట్టె పాకురు, కలుషిత నీటితో నిండిపోయింది. దీంతో పశువులు నీటిని తాగేందుకు ఇబ్బందులు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది. ఉన్నతాధికారులు స్పందించి నీటి తొట్టె లో పేరుకుపోయిన నాచును తొలగించి స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.



ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్): ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ సాయి బాబా హెచ్చరించారు. 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన 'ఆగని ఇసుక అక్రమ రవాణా' అనే కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు డోంగ్లీ ఆర్ఐ సాయిబాబా తెలిపారు. దీంతో బుధవారం తెల్లవారుజామున డోంగ్లీ మండలంలోని లింబూర్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని మద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కళాకారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీపీఆర్‌వో భీమ్ కుమార్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆట, పాటల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కళాకారులు అందిస్తున్న సేవలను గుర్తించి బుధవారం తన చాంబర్‌లో శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి కార్యక్రమాలను ప్రజలకు ఆట, పాటల ద్వారా గత నెలలో దాదాపు 15 రోజుల పాటు తెలియజేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి భీమ్ కుమార్, కళాకారులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పోచమ్మ, మైసమ్మ ఆలయం షెడ్డు నిర్మాణానికి మాజీ కౌన్సిలర్లు నిట్టు వేణు గోపాలరావు, కృష్ణమోహన్‌రావు వారి తల్లి దివంగత హైమావతి జ్ఞాపకార్థంగా రూ.లక్షా 50వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు చీటి పాండురంగారావు, మంచి రవి, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్లు

ఆలయానికి గడ్డి వితరణ

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయ కోడెలకు కుషాల్‌రెడ్డి కుటుంబీకులు ట్రాక్టర్ గడ్డిని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందె మహేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని డీఏవో ఆఫీసు ఎదుట ధర్నా

డొంకేశ్వర్(ఆర్మూర్): తన భర్త మరణించి ఏడాదైనా కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించడం లేదంటూ భీమ్‌గల్ మండలం చేంగల్‌కు చెందిన రాజ్యలక్ష్మి బుధవారం కలెక్టరేట్‌కు వచ్చింది. న్యాయం చేయాలని కుటుంబసభ్యులతో కలిసి జిల్లా వ్యవసాయ కార్యాలయం ఎదుట బైఠాయించింది. భర్త సంగెం ప్రవీణ్ ధర్పల్లి మండల వ్యవసాయాధికారిగా పని చేస్తుండగా గతేడాది మే నెలలో ఎన్నికల డ్యూటీలో గుండెపోటుతో మరణించాడని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్‌తోపాటు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇతర బెనిఫిట్స్ రావాల్సి ఉందన్నారు. ఇంత వరకు వ్యవసాయ శాఖ అధికారులు వీటిని ఇప్పించకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి ఫిర్యాదు చేశారు.

కూతురు పెళ్లైన రెండు రోజులకే..

- గుండెపోటుతో తండ్రి మరణం


పోస్టుమన్ గంగాధర్ (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): కూతురి పెళ్లైన రెండు రోజులకే గుండెపోటుతో తండ్రి మరణించిన ఘటన నందిపేటలో చోటు చేసుకుంది. నందిపేట మండల కేంద్రంలో గత 30ఏళ్లుగా సేవలందిస్తున్న పోస్టుమన్ గంగాధర్ (50)కు ముగ్గురు కూతుళ్లు కాగా చిన్న కూతురు పెళ్లిని ఆదివారం రోజు ఘనంగా చేశారు. మంగళవారం కూతురి అత్తగారింటికి టాటావ్యాన్‌లో కుటుంబంతో సహా వెళుతుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా గంగాధర్‌కు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా, ఫలితం లేకుండా పోయింది. 30ఏళ్లుగా గ్రామీణ డాక్ సేవక్‌గా ప్రజలకు సేవలందిస్తూ ప్రతి ఒక్కరి హృదయాలలో నిలిచిన పోస్టు గంగాధర్.. కూతురు పెళ్లి జరిగి రెండు రోజులు గడువక ముందే హఠన్మరణం చెందడంతో గ్రామస్తులంతా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అంత్యక్రియలలో వేలాది మంది పాల్గొని కంటతడి పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

- బైక్‌ను ఢీకొన్న డీసీఎం వాహనం
- ఆర్మూర్‌లో విషాదఛాయలు

ఆర్మూర్ టౌన్: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి చెందిన విషాద ఘటన ఆర్మూర్ మండలం చేపూర్ శివారులోని 63వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఆర్మూర్ పట్టణానికి చెందిన కొండూరు నాగార్జున్ (21), నరేంద్ర (19) గత ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపురం గ్రామంలోని మేనత్త ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి వస్తుండగా చేపూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నాగార్జున్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన నరేందర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఇరువైపులా నిలిచిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. కటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నాగార్జున (ఫైల్)


నరేందర్ (ఫైల్)

ఒంటరైన తల్లి..

ఆర్మూర్ పట్టణంలోని జెండాగల్లీలో నివాసముండే కొండూరు పద్మ భర్త ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నాగార్జున్ హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తుండగా తమ్ముడు నరేంద్ర అక్కడే హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నాడు. వారం క్రితమే ఆర్మూర్‌లోని ఇంటికి వచ్చారు. అన్నదమ్ములిద్దరూ హైదరాబాద్‌కు బయల్దేరాల్సి ఉండగా ప్రమాదం చోటు చేసుకుంది. కొడుకులు ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తున్నారనుకుంటుండగానే రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలిగొంది. కట్టుకున్న భర్త, ఇద్దరు కుమారులు లోకం వదిలి వెళ్లడంతో తల్లి పద్మ ఒంటరిగా మిగిలింది.

మతి స్థిమితంలేని ఒకరు..

దోమకొండ: భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందన సురేశ్(52) అనే వ్యక్తి దోమకొండ మండలం లింగుపల్లి గ్రామ శివారులో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సురేశ్‌కు మతి స్థిమితం సరిగా లేకపోవడంతో భార్య సంధ్య తన ముగ్గురు కుమారులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. సురేశ్ లింగుపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం భిక్షాటన చేసుకుంటూ ఎండ నుంచి కాపాడుకోవడానికి శివారులోని వ్యవసాయ బావి వద్ద ఒడ్డుపై పడుకున్నాడు. ఎండదెబ్బకు నిద్రలోనే మరణించాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని ఏఎస్సై జానీ బాషా పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వాహనంలో నిద్రిస్తున్న వ్యక్తిపై దాడి

● బంగారు ఆభరణాల దోపిడీ

పిట్లం(జుక్కల్): వాహనంలో నిద్రిస్తున్న వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి బంగారు ఆభరణాలను దోచుకున్న ఘటన బుధవారం ధర్మారం టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన కృష్ణారెడ్డి పని నిమిత్తం తన అశోక్ లేలాండ్ వాహనంలో హైదరాబాద్ నుంచి ప్లాస్టిక్ డిస్పోజల్ గ్లాసులను బిచ్కుందకు తీసుకువచ్చాడు. బుధవారం అర్ధరాత్రి ఆయన తిరిగి వెళ్తూ పిట్లం మండలంలోని ధర్మారం టోల్ ప్లాజా వద్ద వాహనం నిలిపి నిద్రపోయాడు. టోల్‌ప్లాజా వైపు నుంచి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి వాహనంలో నిద్రిస్తున్న కృష్ణారెడ్డిపై కత్తితో దాడి చేసి రెండుతులాల బంగారు గొలుసు, తులం ఉంగరాన్ని దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గ్రామ పంచాయతీపై రాళ్లదాడి



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం కార్యదర్శి చాంబర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి రాళ్లదాడికి పాల్పడ్డారు. దీంతో కుర్చీలు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీలకు పాల్పడిన మహిళ అరెస్టు

ఎల్లారెడ్డి: ఇళ్లలో చోరీలకు పాల్పడిన మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన నీరడి మంజుల (45) ఎల్లారెడ్డి పట్టణంలో అనుమానాస్పదంగా నగలు విక్రయించేందుకు రాగా పట్టుకొని విచారించడంతో అసలు విషయం బయటపడిందన్నారు. ఏప్రిల్ 3న అనిత అనే ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు ముక్కుపుడక దొంగిలించిందని తెలిపారు. ఈ నెల 9న దుద్దుల దుర్గయ్య ఇంట్లో 5 తులాల వెండి, రూ.10 వేల నగదు, మంగళి కిషన్ ఇంట్లో 20 తులాల వెండి, చెవి కమ్మలు, రూ.13 వేల నగదును చోరీ చేసినట్లు పేర్కొన్నారు. తానే ఈ చోరీలకు పాల్పడినట్లు మంజుల ఒప్పుకుందని, ఆమె నుంచి ఒక జత బంగారు కమ్మలు, 20 తులాల వెండి, 5 తులాల వెండి కడియం, రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితురాలిని పట్టుకున్న ఎస్సై మహేశ్, పీసీ ఇద్రీస్, హోంగార్డు ప్రసాద్‌లను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్

చోరీ కేసులో ఒకరికి 16 నెలల జైలు

కామారెడ్డి క్రైం: దేవాలయంలో చోరీకి పాల్పడిన ఓ నిందితుడికి ఎల్లారెడ్డి కోర్టు 16 నెలల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2024 ఫిబ్రవరి 4న ఎల్లారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి హుండీ దోచుకెళ్లారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పోసానిపల్లి గ్రామానికి చెందిన జంగం నర్సింలుగా గుర్తించారు. అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో ఎల్లారెడ్డి కోర్టు న్యాయమూర్తి ఎం సుష్మ నిందితుడికి 16 నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై రాజయ్య, ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిబ్బంది నరేందర్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

తాగి వాహనం నడిపిన ఒకరికి..

ధర్పల్లి: మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మద్దుల్ చౌరస్తా వద్ద ఈ నెల 12న పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా సిరికొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట బుధవారం హాజరుపరచగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

హాట్ టాపిక్‌గా ఎస్సై వ్యవహారం

- ఫిర్యాదుదారులను పట్టించుకోడనే ఆరోపణలు
- ఎస్సై పనితీరుపై మండిపడ్డ సీపీ
- పోలీస్‌స్టేషన్ తనిఖీలో మందలింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని ఓ ఎస్సై పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ గోడును చెప్పుకుందామంటే ఎస్సై అందుబాటులో ఉండరు. ఎస్సై ఉన్న సమయంలో బాధితులు గదిలోకి వెళ్లిన తర్వాత బెదిరింపులకు పాల్పడతారనే విమర్శలున్నాయి. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా కేసును నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించిన బాధితులు చాలా మంది ఉన్నారు. కోర్టు నుంచి ఆదేశాలు వస్తేనే సదరు ఎస్సై కేసు నమోదు చేసిన దాఖలాలున్నాయి. ఎస్సై తీరుపై విసుగుచెందిన బాధితులు సీపీ సాయిచైతన్య వద్దకు వచ్చి తమ సమస్యను చెప్పుకున్న సందర్భాలున్నాయి. ఇటీవల సీపీ సాయిచైతన్య పోలీస్‌స్టేషన్ తనిఖీల్లో భాగంగా సదరు పీఎస్‌కు వెళ్లినప్పుడు ఎక్కువ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుసుకొని ఎస్సైపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సీపీ వద్దకు వచ్చిన వారి దరఖాస్తులను సిబ్బంది సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు పంపిస్తారు. ఈ ఫిర్యాదులను ఎస్సై ఆదేశాల మేరకు పీఎస్ సిబ్బంది బాధితులను పిలిపించి సమస్యలను అడిగి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉటుంది. కానీ, ఈ ఎస్సై ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో సీపీ మందలించినట్లు సమాచారం. ఇటీవల ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ జరుగుతున్న సమయంలో ఎస్సై ఫిర్యాదుదారులతో మాట్లాడిన తీరుపై ఏసీపీ మండిపడినట్లు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎస్సై పనితీరుపై అధికార పార్టీ నేతలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై నియోజకవర్గ నేత దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది.

గౌతంనగర్‌లో పోలీసుల తనిఖీలు

60 వాహనాల స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో పోలీస్ స్టేషన్ పరిధి గౌతంనగర్‌లో బుధవారం రాత్రి సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ బస్వా రెడ్డి సూచన మేరకు ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. 100 మంది పోలీసులు 10 బృందాలుగా ఏర్పడి పెట్రోలింగ్ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, రౌడీ షీటర్లను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు, నంబర్లు లేని దాదాపు 60 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు పోలీసులని, చట్టాన్ని గౌరవించాలన్నారు. అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలపై సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీవాసులు ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కాలనీవాసుల సూచనలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్ రాజ్, రఘుపతి, సురేశ్, మల్లేశ్, భిక్షపతి, శ్రీలత, ఎస్సైలు హరిబాబు, గంగాధర్, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న పోలీసులు